సాక్షి ఒడిశా
శుక్రవారం ၊ 16 ၊ మే ၊ 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,64,042లు, వచ్చాయని అధికారులు తెలిపారు.



నేతాజీ ధైర్యం అజేయం

నేతాజీ జన్మస్థలాన్ని గవర్నర్ సందర్శించారు. నేతాజీ ధైర్యం అజేయమని అన్నారు.

- 8లో



విద్యార్థి కాంగ్రెస్ శక్తిమార్చ్

విద్యార్థి కాంగ్రెస్ నాయకులు శక్తిమార్చ్ నిర్వహించారు. కాల్పుల విరమణపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

పరలా వీధి ఘటనలో మరో ఇద్దరు మృతి

పర్లాకిమిడి: పట్టణంలో రెండోవార్డు పరలా వీధిలో బుధవారం శుభాషిష్ పాణిగ్రాహి కుటుంబం విషం తాగి బలవర్మణానికి పాల్పడిన సంఘటన పాఠకులకు తెలిసిందే. అయితే ఈ ఘటనలో పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రిలో కోడుకు బిజయానంద పాణిగ్రాహి (7) మృతి చెందగా, కూతురు ప్రియదర్శిని(11), తండ్రి శుభాషిష్‌లను బరంపురం మెడికల్‌కు తరలించారు. అయితే గురువారం ఉదయం బరంపురం మెడికల్‌లో చికిత్స పొందుతూ కూతురు ప్రియదర్శిని పాణిగ్రాహి (11), తండ్రి శుభాషిష్ కూడా మృతి చెందినట్లు ఆదర్శ పోలీసు స్టేషన్ ఐఐసీ ప్రశాంత భూపతి తెలియజేశారు.

పిడుగులు పడి 9 పశువులు దుర్మరణం



పిడుగులు పడటంతో మరణించిన పశువులు

జయపురం: పిడుగులు పడి 9 పశువులు దుర్మరణం పాలయ్యాయి. ఈ సంఘటన చందాహండి సమితి పటఖలియ గ్రామంలో బుధవారం జరిగింది. బుధవారం సాయంత్రం వర్షంతో పాటు పిడుగులు పడ్డాయి. ఆ సమయంలో కొంత మంది పశువుల కాపర్లు ఒక చెట్టు వద్దకు చేరుకున్నారు. హఠాత్తుగా పిడుగులు పశువులపై పడ్డాయి. దీంతో ఆవులు, ఎద్దులు, ఆవుదూడలు మరణించినట్లు తెలిసింది. రాజకోట గ్రామం మానసింగ్ గౌఢకు చెందిన రెండు ఎద్దులు, బదలిపాణి గ్రామం అందారు శాంత ఒక ఆవు, ఆవు దూడ, మిశ్ర శాంత పదన శాంతల ఒక్కొక్క ఎద్దు, పాత్ర శాంత ఆవు, ఆవుదూడ, అలాగే రాజేంద్ర శాంతకు చెందిన ఎద్దు మరణించాయని పటఖలియ గ్రామం పంచాయతీ మాజీ సర్పంచ్ హర పూజాయి వెల్లడించారు.

సైబర్ మోసగాళ్ల అరెస్టు



బలిమెల పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెలలో నివాసం ఉంటున్న సత్యవతి అనే మహిళ సైబర్ మోసానికి గురయ్యారు. కొన్ని రోజుల కిందట ఆమెకు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి పేరుతో ఓ వ్యక్తి కాల్ చేసి లాటరీలో స్కూటీ గెలిచారని చెప్పారు. మరో ఇద్దరితో కూడా మాట్లాడించి స్కూటీ కోసం రూ.10500 చెల్లించాలని చెప్పారు. దీంతో ఆమె ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించారు. ఆ తర్వాత వారు ఫోన్ ఎత్తకపోవడంతో బాధితురాలు ఏప్రిల్ 24 న బలిమెల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐఐసీ ధీరజ్ పట్నాయిక్ కేసు నమోద్ చేసి దర్యాప్తు చేపట్టారు. నిందతులు జగత్సింగిపూర్ జిల్లా బొరికిన గ్రామానికి చెందిన వారుగా తెలియడంతో అక్కడకు వెళ్లి బుధవారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.15వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నిహార్ రంజాన్ సాహు, సుశీల్ మహంతి, నారాయణ సేనాపతిలపై కేసు నమోద్ చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

ముగిసిన ఉత్సవాలు



కత్తితో ఊరేగుతున్న మహిళ

రాయగడ: జిల్లాలోని రామనగుడ గ్రామంలో గ్రామ దేవత ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. గత ఐదు రోజులుగా కొనసాగిన ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి వేషధారణలో ఆదివాసీ మహిళ గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం ప్రత్యేక ఘట్టంగా గుర్తింపు పొందింది. అమ్మవారి ప్రతిరూపమైన ఖండా (కత్తి)ని చేతపట్టుకుని మహిళ ఊరేగింపులో పాల్గొంది. ఈ సమయంలో అమ్మవారి పాదాలు తాకితే ఎటువంటి దుష్టశక్తుల దరిచేరవన్న నమ్మకంతో ఆ ప్రాంత వాసులు, ముఖ్యంగా చిన్నపిల్లలను నడిచే మార్గంలో పడుకోబెట్టారు. వారిని దాటుకుంటూ కత్తి పట్టుకుని మహిళ నడుచుకుంటూ వెళ్లిన ఘటంతో ఉత్సవాలు ముగిశాయి.

పరాక్రమ విజయ దివస్ ర్యాలీ



పర్లాకిమిడి: పరాక్రమ విజయ దివస్ మోటారు సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్



పర్లాకిమిడి: పరాక్రమ విజయ దివస్ ర్యాలీలో కలెక్టర్ బిజయ కుమార్ దాస్, ఏడీఎం మరియు



రాయగడ: ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ పట్వారి

పర్లాకిమిడి: ఆపరేషన్ సిందూర్ విజయం తర్వాత భారత సేనలకు అభినందనలు తెలియజేస్తూ గజపతి జిల్లా కలెక్టరేట్ వద్ద జిల్లా పాలనాధికారి బిజయ కుమార్ దాస్ 'పరాక్రమ విజయ దివస్' పేరిట గురువారం సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. జిల్లా యంత్రాంగం నిర్వహించిన ర్యాలీలో ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు. కలెక్టరేట్ నుంచి హైస్కూల్ జంక్షన్, మార్కెట్, పాతబస్టాండు, కొత్త బస్టాండు, ప్యాలెస్ మీదుగా ఫారెస్టు కార్యాలయం వరకూ ఈ మోటారు సైకిల్ ర్యాలీ జరిగింది. ఈ పరాక్రమ విజయ దివస్ ర్యాలీలో ఏడీఎం ఫాల్గుణ మఝి, ఐటీడీఏ పీఓ అంశుమాన్ మహాపాత్రో, సబ్ కలెక్టర్ అనుప్ పండా, పురపాలక అధికారి లక్ష్మణ ముర్ము, తహసీల్దార్ నారాయణ బెహేరా, డీసీపీయూ అరుణ్‌కుమార్ త్రిపాఠి, జిల్లా క్రీడా కోఆర్డినేటర్ సురేంద్ర పాత్రో తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: ఆపరేషన్ సిందూర్ విజయవంతమవ్వడంతో పట్టణంలొ గురువారం జిల్లా యంత్రాంగం నిర్వహించిన పరాక్రమ యాత్రలో భాగంగా నిర్వహించిన బైకు ర్యాలీలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టర్ పరూల్ పట్వారి కలెక్టర్ కార్యాలయం ఎదుట జెండా ఊపి ఈ కార్యక్రమానికి శుభారంభాన్ని పలికారు. అనంతరం బైకు ర్యాలీ పట్టణంలో గల సమితి కార్యాలయం మీదుగా రిలయన్స్ పెట్రోల్ బంక్ నుంచి యూటర్న్ తీసుకుని మెయిన్ రోడ్డు మీదుగా స్థానిక గాంధీపార్క్ వరకు కొనసాగింది. ర్యాలీలొ సీఆర్పీఎఫ్ జవాన్లు కూడా పాల్గొన్నారు.

జయపురం: దేశ సమైక్యత, సంఘీభావానికి గురువారం జయపురంలో మునిసిపాలిటీ నేతత్వంలో నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ పరాక్రమ శోభాయాత్ర అద్దం పట్టింది. మన దేశ రక్షణలో తామంతా ముందుంటామని ప్రజలు నినాదాలు చేశారు. వేలాది ప్రజలతో నిర్వహించిన బైక్ ర్యాలీని ఒడిశా ఆర్థిక మంత్రి సురేష్ పూజారి, ఎస్సీ, ఎస్టీ మైనారిటీస్ వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గోండ్, కామర్స్ , ట్రాన్స్‌పోర్ట్, స్టీల్, మైనింగ్ మంత్రి భిభుతి భూషణ జెన, ఫిషరీష్, యానిమల్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్, మైక్రో, స్మాల్ అండ్ మీడియమ్ ఎంటర్‌ప్రీనియర్స్ మంత్రి గోకులానంద మల్లిక్‌లు సంయుక్తంగా ఆపరేషన్ సిందూర్ పరాక్రమ శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. నెక్సా షోరూం బరిణీపుట్ నుంచి బయలు దేరిన శోభాయాత్ర పట్టణంలో ప్రధాన రహదారుల మీదుగా విక్రమవిశ్వవిద్యాలయం క్రీడా మైదానం చేరుకుంది. విశ్వవిద్యాలయ మైదానంలో జరిగిన సభలో రెవెన్యూ మంత్రి సురేష్ పూజారి వీర సైనికులకు నివాళులర్పించేందుకు శోభాయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్, జయపురం సబ్ కలెక్టర్ అక్కవర శౌశ్యా రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి : మల్కన్‌గిరిలో గురువారం స్థానిక బిజూ పట్నాయిక్ ఇండోర్ స్టేడియం నుంచి డీఎన్‌కే క్రీడా మైదానం వరకు త్రివర్ణ యాత్ర నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్ త్రివర్ణ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. 200 మీటర్ల జాతీయ జెండాతో త్రివర్ణ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్, సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి డిపిఆర్‌ఓ ప్రమిళా మాఝి తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: హైస్కూల్ వద్ద పరాక్రమ విజయ దివస్ ర్యాలీ



రాయగడ: బైక్ ర్యాలీలో పాల్గొన్న యువత



జయపురం: ఆపరేషన్ సిందూర్ పరాక్రమ శోభాయాత్ర



జయపురం: సింధూర్ పరాక్రమ శోభాయాత్రలో బైకలతో పాల్గొన్న యువత



జయపురం: ప్రజలలో దేశభక్తి ఉప్పొంగిన వేళ



మల్కన్‌గిరి : బిజూ పట్నాయిక్ ఇండోర్ స్టేడియం నుంచి ప్రారంభమైన త్రివర్ణ యాత్ర



మల్కన్‌గిరి : బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ సోమానాథ్ ప్రధాన్



మల్కన్‌గిరి : త్రివర్ణ యాత్రలో పాల్గొన్న ప్రజలు

బైక్ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో పడి ఉన్న పరదేశీ హల్వా



సంఘటన స్థలంలో బైక్

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి బలిమెల–మల్కన్‌గిరి ప్రధాన రహదారి ఖిల్‌గూఢ గ్రామం కూడలి వద్ద గురువారం మధ్యాహ్నం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. డుడుమేట్ల పంచాయతీ డంగాగూఢ గ్రామానికి చెందిన పరదేశీ హల్వా, భీమ హల్వా ఒక బైక్‌పై వస్తున్నారు. నూవగూఢ గ్రామానికి చెందిన సంభారు మాడీ బైక్‌పై నుంచి పడిపోయారు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించి క్షతగాత్రులను కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స చేసి మేరుగైన వైద్యం కోసం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కోరుకొండ ఏఎస్ఐ ప్రదీప్ కుమార్ ఖీలో ఇతర సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి జగదల్‌పూర్‌లో వేదాంత అల్యూమిన కర్మాగారం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. డాక్టర్ నీలేష్ జైన్, డాక్టర్ వికాష్ రంజన్ ప్రహరాజ్, జగదల్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ అధికారి డాక్టర్ పార్థసారధి సాహు, వేదాంత కర్మాగారం మెడికల్ అధికారి ప్రశాంత్ కుమార్ పరిమానిక్‌లు వివిధ ప్రాంతాలకు చెందిన 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వేదాంత్ మెడికల్ కో–ఆర్డినేటర్ ఆశోక్ కుమార్ ఖొర పర్యవేక్షణలో శిబిరం జరిగింది.

సారా బట్టీలపై దాడులు



దాడుల్లో పట్టుబడిన బెల్లంఊట



పట్టుబడిన నాటుసారా

పర్లాకిమిడి: గజపతి జిల్లా గారబంద పోలీసుస్టేషన్ పరిధి పెద్ద బురుజోల్లి, మరంగి, సన్నో బురుజోల్లి, శవర తాలసింగి, పర్లాకిమిడి పీఎస్ పరిధిలోని సిద్ధ మణుగు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా జరిపిన దాడుల్లో 12,300 లీటర్ల నాటుసారా ప్యాకెట్లు, బెల్లం ఊట 1,330 లీటర్లు పట్టుకుని ధ్వంసం చేశారు. అయితే దాడుల్లో ఎవరూ అరెస్టు కాలేదు. నిందితులు తప్పించుకున్నట్లు ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న కుమార్ పటేల్ తెలియజేశారు.

అంబోదళలో దాహం కేకలు



పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించిన మహిళలు

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబోదళలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో బుధవారం మహిళలంతా కలిసి పంచాయతీ కార్యాలయానికి తాళంవేసి నిరసన తెలిపారు. అంబోదళలో పాయికో, గౌడ వీధుల్లో 150కి పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరందరి తాగునీటి సౌకర్యార్థం ఉండే సోలార్ గొట్టపుబావి గత మూడేళ్లుగా మరమ్మతులకు గురయ్యింది. అదేవిధంగా ఉన్న రెండు గొట్టపు బావుల్లో ఒకటి పాడైపోయింది. దీంతో తాగునీటికి నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

విద్యార్థుల కోసం కొత్త ఒప్పందం: మంత్రి



ఉన్నత విద్యా శాఖ మంత్రి అధ్యక్షతన భారత జాతీయ స్టాక్ ఎక్సేంజ్‌తో ఒప్పంద కార్యక్రమం

భువనేశ్వర్: రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ, భారత జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ మధ్య గురువారం అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదిరింది. ఈ నేపథ్యంలో ఇర పక్షాలు అనుబంధ దస్తావేజులపై సంతకాలు చేసి అంగీకారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యా మంత్రి సూర్యవంశీ సూరజ్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం జరిగింది. వివిధ విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్ల సమక్షంలో సమక్షంలో విభాగం మండల కమిషనర్, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అరవింద్ అగర్వాల్, భారత జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ అధికారులు, ఒప్పంద పత్రంపై సంతకాలు చేసి అవగాహన కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలో వివిధ కళాశాలల అధ్యక్షులు, విద్యార్థులు వర్చువల్ చానెళ్ల ద్వారా హాజరయ్యారు. ఈ అవగాహన ఒప్పందంపై (ఎంఓయూ) సంతకం చేయడం వల్ల రాష్ట్రంలో కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించి ఆర్థిక అక్షరాస్యత మెరుగడల సాధ్యమవుతుంది. దీనితో పాటు, విద్యార్థులు భవిష్యత్‌లో వివిధ ఉపాధి అవకాశాలను కూడా పొందగలుగుతారు.

ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు రెండు రకాల కోర్సులు అందుబాటులోకి వస్తాయని మంత్రి ప్రకటించారు. ఇవి విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే కాకుండా వారి ఆర్థిక అక్షరాస్యతను పెంపొందిస్తాయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీని వల్ల విద్యార్థులు భవిష్యత్‌లో ఆర్థిక రంగంలో వివిధ ఉపాధి అవకాశాలను పొందేందుకు వీలు కలుగుతుంది. ఆర్ట్స్, సైన్స్, కామర్స్, వివిధ గ్రాడ్యుయేట్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు కొత్త కోర్సులు కలిసి వస్తాయి. ఈ కోర్సులు విద్యార్థులకు సంప్రదాయ కెరీర్‌లను కొనసాగించడానికి అవకాశాలను అందించడమే కాకుండా, కొత్త కెరీర్ ప్రణాళిక, ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తెస్తుందని మంత్రి వివరించారు. గురువారం జరిగిన భారత జాతీయ స్టాక్ ఎక్సేంజ్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం రాబోయే రోజుల్లో విద్యార్థులకు అనేక ఉపాధి అవకాశాలను అందిస్తుంది. అదనంగా జాతీయ విద్యా విధానం – 2020 ఆధారంగా విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధిని నిర్ధారించడం ద్వారా రాష్ట్రంలో విద్యా రంగం సమగ్ర అభివృద్ధిని సాధించవచ్చని ఉన్నత విద్యా మంత్రి సూర్యవంశీ సూరజ్ అభిప్రాయపడ్డారు.

క్లుప్తంగా

మాశ్యామకాళీ ఊరేగింపు



మాశ్యామకాళీ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పర్లాకిమిడి: పట్టణంలో మాస సంక్రాంతి సందర్భంగా కాయగూరల మార్కెట్‌ను గురవారం బంద్ చేశారు. మాశ్యామకాళీ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అన్ని దేవాలయాల్లోనూ అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థి కాంగ్రెస్ శక్తి మార్చ్



రాష్ట్ర విద్యార్థి కాంగ్రెస్ ఆధ్వర్యంలో శక్తి మార్చ్

భువనేశ్వర్: రాష్ట్ర విద్యార్థి కాంగ్రెస్ గురువారం శక్తి మార్చ్ కార్యక్రమం నిర్వహించింది. దివంగత ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆ శాఖ అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్ తెలిపారు. 1971లో భారత దేశం, పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని పురస్కరించుకుని అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పాకిస్తాన్‌ను రెండు భాగాలుగా విభజించి బంగ్లాదేశ్ ఆవిష్కరణతో పాకిస్తాన్‌కు ఖంగు తినిపించారు. వర్ధమాన పరిస్థితుల్లో అందుకు భిన్నంగా అమెరికా ఒత్తిడితో వెంటనే కాల్పుల విరమణ ప్రకటించడం విచారకరమని అన్నారు. అప్పట్లో ఇందిరా గాంధీపై అమెరికా ఒత్తిడి తెచ్చిన మన దేశ వ్యవహారాల్లో వేరొకరి ప్రమేయం అవాంఛనీయమని దేశ గౌరవ ప్రతిష్టలకు పట్టంగట్టారని తెలిపారు. అందుకే రాష్ట్ర విద్యార్థి కాంగ్రెస్ నాయకులు ఇందిరా గాంధీ జ్ఞాపకార్థం మార్చ్ నిర్వహించినట్లు వివరించారు.

ముగిసిన పీజీ సెట్ దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ పీజీ సెట్ -2025 దరఖాస్తులు స్వీకరణ గడువు ముగిసింది. మార్చి 31న నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. రూ. 2000 అదనపు రుసుముతో ఈ నెల 20 వరకు, రూ. 4000 అదనపు రుసుముతో 24 వరకు, రూ.10,000 అదనపు రుసుముతో 25వ తేదీ వరకు దరఖాస్తులు స్వీరిస్తారు. మే 30 నుంచి హాల్ టికెట్లు అందుబాటులో ఉంచుతారు. జూన్ 9 నుంచి 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలు కూడా ఏపీ పీజీసెట్ - 2025 ద్వారానే నిర్వహిస్తారు.

నేడు డెంగీ అవగాహన ర్యాలీ

అరసవల్లి: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా మలేరియా నివారణాధికారి పి.వి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిత బృందం ఈ ర్యాలీని ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఏడు రోడ్ల కూడలిలో ప్రతిజ్ఞ అనంతరం కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు.

రైలు ఢీకొని ఆవు మృతి



ఊడిపడిన రైలు ఇంజిన్‌లోని ఓ భాగం

టెక్కలి రూరల్: స్థానిక తెంబూర్ రోడ్డులో రైల్వే గేటు సమీపంలో గురువారం రైలు ఢీకొని ఆవు మృతిచెందింది. గుణుపూర్ నుంచి పూరి వైపు వెళ్తున్న రైలు టెక్కలి సమీపంలోకి వచ్చేసరికి పట్టాలపైకి ఆవు రావడంతో ఈడ్చుకుపోయింది. ఈ క్రమంలో ట్రైన్ ఇంజిన్‌కు చెందిన కొన్ని భాగాలు సైతం విరిగి పడ్డాయి. విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు.

టెక్కలి ఎంజేపీ విద్యార్థినికి ప్రశంసలు

టెక్కలి: టెక్కలి ఎంజేపీ ఏపీ బాలికల పాఠశాలకు చెందిన జె.నవ్య ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 590 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా గురువారం విజయవాడలో జరిగిన అభినందన సభలో ప్రశంసాపత్రం, అవార్డు అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పూసపాటి సుధారాణి తెలిపారు. బీసీ సంక్షేమ శాఖామంత్రి ఎస్.సవిత, ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ, ఎంజేపీ ఏపీ పాఠశాలల సెక్రటరీ మాధవీలత, పూర్వపు సెక్రటరీ కృష్ణమోహన్ తదితరుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు అధికారులే వారధులు



సీడీఓ, బీడీఓల్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: మండలాలు ప్రభుత్వ పాలన సాఫల్యత ప్రతిబింబింప జేసే అద్దాలని, ప్రజలు ప్రభుత్వ పథకాల నుంచి ప్రయోజనం పొందడం ప్రభుత్వ సామర్థ్యానికి నిదర్శనం అవుతుందని సీఎం మోహన్ చరణ్ మాఝి అన్నారు. గురువారం స్థానిక లోక్ సేవా భవన్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రముఖ అభివృద్ధి అధికారులు (సీడీఓ), మండల అభివృద్ధి అధికారులు (బీడీఓ) సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లాలో అన్ని పథకాలను విజయవంతంగా అమలు చేయడంపైనే ప్రభుత్వ విజయం ఆధారపడి ఉంటుందని అన్నారు. అన్ని అభివృద్ధి పనులు ప్రజలకు అక్కరకు దోహదపడితే మండల, జిల్లా స్థాయి పురోగతి సాధ్యమవుతుందని అన్నారు. ఈ దిశలో సీడీఓ, బీడీఓలు, జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు ముఖ్యమైన పాత్రధారులని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో జిల్లా మేజిస్ట్రేట్ మినహా మండల స్థాయిలో ప్రముఖ అభివృద్ధి అధికారులు, మండల అభివృద్ధి అధికారులు ప్రధాన బాధ్యతను నిర్వహించడం అనివార్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రణాళికలు ప్రజల కోసమేనని, అధికారులు, సిబ్బంది ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి వంటి వారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా తాను ముఖ్య సేవకుడిగా భావించి ప్రజా సేవకు కృషి చేస్తున్నట్లు అధికారుల్ని ప్రోత్సహించారు. అవినీతి లేదా నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. కార్యక్రమానికి హాజరైన పంచాయతీరాజ్ తాగునీటి శాఖ మంత్రి రవి నారాయణ్ నాయక్ మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ ఆలోచనలు గ్రామాల అభివృద్ధి లేకుండా దేశం అభివృద్ధి చెందదని ప్రబోధించారని అన్నారు. బాపూజీ దార్శనికత ఆధారంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.. ప్రభుత్వ ప్రణాళికలను ప్రజలకు సరిగ్గా చేరదీసి కొత్త ప్రభుత్వ పాలన విధానం దృక్పథం మరియు బాధ్యతాయుత భావానికి సీడీఓ, బీడీఓలు సారథ్యం వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, పంచాయతీరాజ్ మరియు తాగు నీటి శాఖ కమిషనర్ మరియు కార్యదర్శి గిరీష్ ఎస్ఎన్, తాగునీరు, పారిశుధ్య శాఖ డైరెక్టర్ వినీత్ భరద్వాజ్, 30 జిల్లాల ముఖ్య అభివృద్ధి, 314 మండలాల అభివృద్ధి సమావేశంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై చర్యలు



మాట్లాడుతున్న ఏడీఎం రమేష్ చంద్ర నాయక్, పక్కనే ఎస్పీ స్వాతి, తదితరులు

రయగడ: రోడ్డు ప్రమాదాల నివారణపై బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ చంద్రనాయక్ అధ్యక్షతన అత్యవసర సమావేశాన్ని కలెక్టర్ సమావేశం హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఆర్టీఓ శివశంకర్ చౌదరి, రాయగడ సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నాయక్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై సంబంధిత అధికారుల దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ పరిధుల్లో ప్రధాన రహదారుల్లో ప్రమాద నివారణ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా రేడియం లైట్లు, తదితరమైనవి అత్యవసరంగా ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక బాకురు గుడ వద్ద గల నాగావళి ప్లానిటోరియం సమీపంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలోని ప్రధాన ప్రాంతాలతోపాటు షాపింగ్ మాల్‌ల వద్ద ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

తరచూ తనిఖీలు..

ట్రాఫిక్ బంధనలు ఉల్లఘించిన వారిపై కొరఢా ఝులిపిస్తున్నామని ఆర్టీఓ శివశంకర్ చౌదరి అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి అతివేగంగా వాహనాలు నడిపే 15 మందిపై చర్యలు తీసుకున్నట్లు వివరించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే 965 మందికి జరిమానా విధించి వారి వద్ద రూ.9.65 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. సీటు బెల్టు లేకుండా వాహనాలు నడిపే 294 మందిని గుర్తించి వారి నుంచి రూ. 3.2 లక్షలు జరిమానాను విధించామని వివరించారు. ఇతరత్ర నియమాలు ఉల్లంఘించిన మరో 233 మంది వద్ద రూ.1.81 లక్షలను వసూలు చేశామన్నారు.

‘జగన్నాథ దామా’ పేరు పెట్టడం తగదు



మాట్లాడుతున్న బినోద మహాపాత్రో

జయపురం: పశ్చిమబెంగాల్‌లోని దిగాలో నిర్మించిన జగన్నాథ్ మందిరానికి జగన్నాథ్ దామా అని పేరు పెట్టడాన్ని ఉత్కళ సమ్మిళిని కొరాపుట్ జిల్లాశాఖ తీవ్రంగా వ్యరేకించింది. గురువారం జయపురం ఉత్కళ సమ్మిళిని కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బినోద్ మహపాత్రో మాట్లాడారు. హిందూ, సనాతన ధర్మం ప్రధాన గురువు ఆదిశంకరాచార్యుల సమయంలో దేశంలో నాలుగు దామాలు ఉండేవన్నారు. వాటిలో ఒకటైన పూరీ జగన్నాథ్ దామం ప్రసిద్ధి చెందిందని వెల్లడించారు. దిగాలో నిర్మించిన జగన్నాథ మందిరానికి జగన్నాథ్ దామా అని నామకరణం చేయటం తగదన్నారు. ప్రపంచంలో ఉన్న హిందువులందరికీ జగన్నాథ క్షేత్రం ఒక విశ్వాసం, ఒక ధర్మ పీఠమన్నారు. ప్రపంచంలో అన్ని చోట్లా జగన్నాథ మందిరాలు నెలకొల్పారని, మందిర ప్రతిష్టపై ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని దిగాలో నిర్మించిన జగన్నాథ మందిరానికి జగన్నాథ్ దామం అని పేరు పెట్టడం మంచిది కాదన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి మోహణ చరణ మఝి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అరవింద పాడీ, పూరీ గజపతికి లిఖిత పూర్వకంగా తెలియజేయటాన్ని ఉత్కళ సమ్మిళిని స్వాగతిస్తుందని వెల్లడించారు. కేంద్ర హోం మంత్రి వెంటనే కలుగుజేసుకొని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఉత్కళ సమ్మిళిని జిల్లా అధ్యక్షుడు మదన మోహన్ నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పరమేశ్వర పాత్రో పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడికి గాయాలు



యువకుడిని తీసుకెళ్తున్న 108 సిబ్బంది

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఎల్‌సీ గేట్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం జిల్లా ఆసుపత్రి రిమ్స్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తి పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన యువకుడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అపస్మారక స్థితిలో విశ్రాంత ఉద్యోగి



వెంకటస్వామిని 108 అంబులెన్సులోకి ఎక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం ఓ ప్రయాణికుడు దుస్తులు లేకుండా అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని ఆర్టీసీ ఎస్ఎం ఎంపీ రావు గమనించారు. వెంటనే కాంప్లెక్స్ ఔట్‌పోస్ట్ హెచ్‌సీ ఎస్.శ్రీనివాసరావుకు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని వివరించారు. ఆయన వచ్చి పక్కనే ఉన్న దుస్తులను పరిశీలించగా ఆధార్‌కార్డు, ఫోన్ నంబరు లభించాయి. వాటి ఆధారంగా కంచిలి మండలం పెద్దపోలేరు గ్రామానికి చెందిన తులసీదాస్ వెంకటస్వామి మల్లపురెడ్డిగా గుర్తించా రు. విశ్రాంత ఉద్యోగి అని, కుటుంబ సభ్యులు ముంబైలో ఉంటున్నట్లు తెలుసుకుని వారికి సమా చారం అందించారు. ఇటీవల కంచిలి మండలం పెద్దపోలేరులో జరిగిన పండగలకు వచ్చి తిరుగు ప్రయాణంలో అపస్మారక స్థితికి చేరుకున్నట్లు గుర్తించి 108 రిమ్స్‌కు తరలించారు. ఆర్టీసీ సెక్యూరి టీ గార్డు జి.రామారావు తదితరులు ఉన్నారు.

నేతాజీ ధైర్యం అజేయం: గవర్నర్



నేతాజీ సంగ్రహాలయం సందర్శనలో రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి



సంగ్రహాలయంలో నేతాజీ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించిన గవర్నర్



నేతాజీ జన్మ స్థలం ఆవరణలో విగ్రహం దగ్గర గవర్నర్ శ్రద్ధాంజలి

భువనేశ్వర్: నేతాజీ ధైర్యం అజేయమని, అఖండ భారత దేశం కోసం దృఢమైన సంకల్పంతో భారత జాతీయ సైన్యం నాయకత్వం, స్వేచ్ఛాయుతమైన, లోతైన జాతీయ నైతిక విలువల్ని నిక్షిప్తం చేసుకుందని రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి కొనియాడారు. గురువారం కటక్ నగరంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మస్థలాన్ని ఆయన సందర్శించారు. భారత దేశపు వర పుత్రుల్లో ప్రముఖునిగా నేతాజీ సుభాష్ చంద్రబోసు జీవన సాఫల్యం నిత్యం చైతన్య జ్యోతిగా ప్రజ్వలిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన నేతాజీ జన్మ స్థల భవన సముదాయం వెలుపల, లోపల ఉన్న విగ్రహం, ఫొటో పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

18 కేజీల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

కాశీబుగ్గ : పలాస రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి 18 కేజీల 550 గ్రాముల గంజాయితో ఓ వ్యక్తి పట్టుబడినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. గురువారం కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. సుజిత్ సూర్జియా అనే వ్యక్తి గుణుపూర్ నుంచి పలాస మీదుగా బరంపురం వెళ్లే ఉమా ఎక్స్‌ప్రెస్ బస్సుకు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. వ్యసనాలకు బానిసయ్యాడు. పర్లాకిమిడికి చెందిన పుస్కో పొరిచా అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. పొరిచా తాను ఇచ్చే గంజాయిని ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణా చేయమని సుజిత్‌కు చెప్పగా అందుకు అంగీకరించాడు. ఈ క్రమంలో మహారాష్ట్రకు 18.550 కేజీల గంజాయిని తరలిస్తుండగా పలాసలో కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, సిబ్బంది పట్టుకున్నారు. సుజిత్‌తో వచ్చిన మరో ఇద్దరు పరారయ్యారు.

యాత్రికులకు అస్వస్థత

- మృతి చెందిన వృద్ధురాలు



ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న యాత్రికులు

మృతి చెందిన ముని లక్ష్మమ్మ

ఇచ్ఛాపురం: తీర్థయాత్రకు బయల్దేరిన చిత్తూరు వాసులకు విషాదం ఎదురైంది. యాత్రికులు అస్వస్థతకు గురి కాగా ఒకరు మృతి చెందారు. చిత్తూరు జిల్లా, పెద్ద పంజాని మండలం పరిధి లో గోనుమాకన్నపల్లితో పాటు మరికొన్ని గ్రామాలకు చెందిన 46 మంది ఓ ప్రైవేటు ట్రావెల్స్ ద్వారా ఈ నెల 8న తీర్థయాత్రలకు బయల్దేరారు. దారిలో స్వయంగా భోజనాలు సిద్ధం చేసుకుని తినేవారు. కాశీ, అయోధ్య దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నెల 13న సాయంత్రం ఒడిశా స మీపించేసరికల్లా వీరిలో 30 మందికి వాంతు లు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గుర య్యారు. గురువారం ఇచ్ఛాపురం చేరుకునేసరికి ఇంకా ఎక్కువ మంది అస్వస్థతకు గుర య్యారు. దీంతో వీరు అదే బస్‌లో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చేరారు. వీరిలో పిచ్చుగల్లు మునిలక్ష్మమ్మ (69) ఆస్పత్రికి వచ్చేలోపే చనిపోయారని వైద్యులు పి.దేవేంద్రరెడ్డి తెలిపారు. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్న వా రు కోలుకుంటున్నారు. మృతురాలి చెల్లి తోటి గంగులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ బి.జగదీశ్వరరావు కేసు నమోదు చేశారు.

‘దేశవ్యాప్త సమ్మెవిజయవంతం చేయాలి’

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): భవన నిర్మాణ కా ర్మికుల సంక్షేమ పథకాలను, లేబర్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన బిల్డింగ్ కార్మికుల సంక్షేమ నిధిని తిరిగి జమ చేయాలని కోరుతూ మే 20 న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం డైమండ్ పార్క్ దగ్గర భవన నిర్మాణ కార్మికులకు సమ్మె కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేసి, పోస్టర్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఎన్నికలలో టీడీపీ కూటమి హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి 10 నెలలైనా సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమత్రి పవన్ కల్యాణ్ అమలుచేయడానికి పూనుకోకపోవడం అన్యాయమన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

- లాభసాటి ఉత్పత్తులపై దృష్టి సారించండి
- నైరా గ్రామ సందర్శనలో కలెక్టర్



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం రూరల్: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సంసద్ ఆదర్శ్ గ్రామ యోజనలో భాగంగా శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని నైరా గ్రామంలో గురువారం పర్యటించారు. స్థానిక సచివాలయంలో అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్థక శాఖలపై సమీక్షించారు. స్థానిక రైతులు పండిస్తున్న పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాడిపరిశ్రమ అభివృద్ధిపై ఆరా తీశారు. పాడిపంటలు, వ్యవసాయ ఉత్పత్తులు మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎంపీడీఓ బి.శైలజ, నైరా సర్పంచ్ అరవల రామ్‌ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈపై కలెక్టర్ ఆగ్రహం..

ఎలక్ట్రికల్ ఏఈపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో సూర్యఘర్ పథకానికి ఎన్ని కనెక్షన్‌లు ఏర్పాటు చేశారని, విద్యుత్ కెపాసిటీ, ప్రతిపాదనలు ఏమేరకు నిర్వహించారని ప్రశ్నించగా ఏఈ సమాధానం చెప్పలేకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఏఈని సస్పెండ్ చేయాలంటూ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు శివచరణ్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్ విద్యార్థి ఎండ శివచరణ్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యా డు. సీఎస్‌ఈ బ్రాంచ్ మూడో ఏడాది చదువుతున్న శివచరణ్ ఇటీవల విజయనగరం జిల్లా కొండవెలగాడలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ -23 విభాగంలో 67 కిలోల గ్రీకోరోమన్ విభాగంలో ప్రతిభ కనబర్చాడు. దీంతో ఈ నెల 17, 18 తేదీల్లో చిత్తూరు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు అర్హత సాధించాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫ్యాకల్టీ, యాజమాన్య సభ్యులు గురువారం అభినందించారు.

రూ.కోట్లు వృథా..

తీరని వ్యథ!



కడగండి రిజర్వాయర్

- చుక్కనీరివ్వని కడగండి రిజర్వాయర్
- రైతులకు తప్పని ఇక్కట్లు
- స్పందించని పాలకులు, అధికారులు

ఎల్.ఎన్.పేట :

కడగంటి జలాశయం.. రెండు మండలాల రైతుల చిరకాల స్వప్నం. ఈ జలాశయం నిర్మాణం పూర్తయి రెండు దశాబ్దాలు కావస్తున్నా కుడి, ఎడమ కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో కళ్ల ఎదుటే నీరు వృథాగాపోతున్నా ఏమీ చేయలేని దయనీయ పరిస్థితిలో రైతులు ఉన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని పాలకులకు, అధికారులకు వేడుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకునే వారేరీ?

ఎల్.ఎన్.పేట మండలం జంబాడ-బొర్రంపేట గ్రామాల మధ్య కొండల మధ్య నుంచి కడగండి గెడ్డ ప్రవహిస్తుంటుంది. కొండల్లో కుండపోతగా వర్షం కురిస్తే కడగండి గెడ్డ వారం పాటు నిండుగా ప్రవహిస్తూ దిగువ ప్రాంతానికి వృథాగా వెళ్లిపోతుంది. ఈ నీటిని ఒడిసిపట్టి పంట పొలాలకు అందిస్తే వంద ల ఎకరాలు సశ్యశ్యామలం అవుతాయని, రెండు పంటలను పండించుకోవచ్చని భావించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2005 జూలై 20న జలయజ్ఞంలో భాగంగా ‘నీటి పారుదల శాఖ ప్రత్యేక పరిశోధనా విభాగం, ఐఆర్‌డీఎఫ్-9’లో రూ.195.16 లక్షలు (సుమారు రూ.2కోట్లు) నిధులు మంజూరు చేశారు. 580 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 81 ఎకరాల్లో చేపట్టిన జలాశయం నిర్మాణం పనులు 2007 నాటికి పూర్తి చేశారు. కుడి, ఎడమ కాలువ నిర్మాణం కోసం 2008లో టెండర్లు పిలిచారు. భూసే కరణ చేయకపోవటంతో కాలువ పనులు నిలిచిపోయాయి. 2009లో వైఎస్సార్ మరణానంతరం రిజర్వాయర్‌ను పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు.

580 గ్రామాలకు సాగునీరు..

కడగండి జలాశయంకు కుడి, ఎడమ కాలువల నిర్మా ణం పూర్తయితే ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి మండలా ల్లోని 580 గ్రామాలకు సాగునీరు అందుతుంది. ఎడమ కాలువ పరిధిలో ఎల్.ఎన్.పేట మండలం జంబాడ, వలసపాడు, బొర్రంపేట, ముంగెన్నపాడు, కరకవలస, మల్లికార్జునపురం, శ్యామలాపురం, కుశమల పాడు రెవెన్యూ గ్రామాల్లోని పంట భూములకు సాగునీరు అంతుంది. కుడి కాలువ పరిధిలో ఎల్.ఎన్.పేట మండలం వలసపాడు, బొర్రంపేట, జంబాడ, సరుబుజ్జిలి మండలంలోని గోనెపాడు, అమృతలింగానగరం, బప్పడాం, సరుబుజ్జిలి, కూనజమ్మన్నపేట తదితర గ్రామాలకు సాగునీరు అందుతుంది.

నిధులున్నా నిర్లక్ష్యం..

రిజర్వాయర్‌కు కుడి, ఎడమ కాలువల నిర్మాణంతో పాటు రైతుల వద్ద సేకరించి భూమికి పరిహారం చెల్లించాలని రైతులు అనేక ఫిర్యాదులు చేశారు. దీంతో గతంలో రూ.4.06 కోట్లు మంజూరు చేశారు. వీటిలో రూ.1.45కోట్లు భూసేకరణ కోసం, రూ.1.72 కోట్లు, కాలువల నిర్మాణం కోసం మిగిలిన నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. రిజర్వాయర్ లోపలి భాగంలో భూములు ముంపు బారిన పడుతున్నాయని, వాటిని ముంపు నుంచి తప్పించేందుకు గట్టు పెంచేందుకు రూ.89 లక్షలు ఖర్చు చేశారు. మిగిలిన పనులు గాలికి వదిలేశారు.



అసంపూర్తిగా వదిలేసిన కాలువ

ఇప్పటికైనా స్పందించాలి..



కడగండి జలాశయం నిర్మాణం పనులు పూర్తి చేసి 20 ఏళ్లవుతుంది. ఇప్పటి వరకు సెంటు భూమికి కూడా చుక్కనీరు అందలేదు. రిజర్వాయ ర్ నిండినా నీరు వృథాగా పోతుంది. దిగువన పంట భూములు నీట మునిగి రైతులు నష్ట పోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి కాలువల పనులు పూర్తి చేయాలి.

– మామిడి నీలంనాయుడు, రైతు, బొర్రంపేట, ఎల్.ఎన్.పేట

క్లుప్తంగా

భోగాపురం విద్యార్థికి షైనింగ్‌స్టార్-2025 అవార్డు


హరీష్

పూసపాటిరేగ: పదవతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన భోగాపురం మోడల్‌స్కూల్ విద్యార్థి కొయ్య హరీష్‌కు షైనింగ్ స్టార్స్-2025 అవార్డు వచ్చింది. ఈ ఏడాది పదవతరగతి ఫలితాల్లో హరీష్ 593 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి మోడల్ స్కూల్స్‌లో ప్రథమస్థానంలో నిలిచాడు. దీంతో ఈనెల 20 వతేదీన అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం, మంత్రుల చేతుల మీదుగా షైనింగ్‌స్టార్ -2025 అవార్డు తీసుకోనున్నాడు. ఈనెల 19 వతేదీన మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడలోని లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్‌లో విద్యార్థి తల్లిదండ్రులుతో పాటు రిపోర్టు చేయాలని భోగాపురం మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సి.పార్వతి తెలిపారు.

ప్రభుత్వ ఉత్తర్వు 20ని సవరించాలి


ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.బాలకృష్ణ

పార్వతీపురంటౌన్: రాష్ట్ర విద్యాశాఖలో తొమ్మిది రకాల పాఠశాలల ఏర్పాటు అశాస్త్రీయమని, కొత్తగా విడుదల చేసిన ప్రభుత్వ ఉత్వర్వు 20లోని నియమాలు విద్యాహక్కు చట్టం స్ఫూర్తికి భిన్నంగా ఉన్నాయని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్. బాలకృష్ణ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 117నంబర్ ఉత్తర్వులకన్నా ఈ నిబంధనలు దారుణంగా ఉన్నాయని, ఉపాధ్యాయ సంఘాలతో లెక్కలేనన్ని సమావేశాలు ఏర్పాటు చేసినా వారి సూచనలను వేటినీ పరిగణనలోకి తీసుకోకపోవడం అప్రజాస్వామ్యమన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి సహేతుకం కాదన్నారు. ప్రస్తుత ఉత్తర్వులు ఉపాధ్యాయులకు పనిభారాన్ని పెంచాలనే లక్ష్యంతోనే రూపొందించినట్లు అర్థమవుతోందన్నారు. వీటి ప్రకారం ప్రతి ఉపాధ్యాయుడు కనీసం వారానికి 40 పీరియడ్లకు తక్కువ కాకుండా పనిచేయాల్సి ఉంటుందని, కొంతమంది ఇంకా ఎక్కువ పీరియడ్స్ కూడా పనిచేయవలసి వస్తుందన్నారు. కావున ప్రభుత్వం జోక్యం చేసుకుని ఉత్వర్వులను సవరించాల్సిందిగా కోరుతున్నామన్నారు.

ఎక్కడైనా స్టాంపుల విక్రయం

- జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్

చీపురుపల్లి: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం జారీ చేసిన లైసెన్స్ కలిగిన వెండర్ల ద్వారా స్టాంప్‌లను పబ్లిక్‌కు అందుబాటులో ఉండే ఎలాంటి ప్రాంతాల్లోనైనా విక్రయించవచ్చునని జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర చెప్పారు. ఈ మేరకు చీపురుపల్లి పట్టణంలో స్టాంప్‌ల విక్రయాలకు సంబంధించి అధిక ధరలు తీసుకుంటున్నారని నోటరీ న్యాయవాది పి.తవిటినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం సాయంత్రం ఆయన చీపురుపల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుతో మాట్లాడి ఆయన నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రిజిస్టర్ స్టాంపులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై పబ్లిక్‌ను విచారణ చేసి వారి నుంచి వాంగ్మూలం సేకరించి రిపోర్టును ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీల్లో వైద్యసేవలు మెరుగు పరచాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు

పార్వతీపురంటౌన్: పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలను మెరుగు పర్చాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు ఆదేశించారు. ఈ మేరకు యూపీహెచ్‌సీ వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో గురువారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో, క్షేత్రస్థాయి సేవలపై నెలవారీ నివేదికలను పరిశీలించారు.ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ వివరాలు, ల్యాబ్ పరీక్షలు, మందులు, ఈహెచ్‌ఆర్ నమోదుపై సమీక్షించారు. కార్యక్రమంలో డీఐఓ నారాయణరావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డా పీఎల్.రఘు కుమార్, డీపీఓ లీలారాణి, వైద్యాధికారులు డా.రవిచంద్ర, డా.గణేష్, డా.చాంద్, కార్యాలయం ఏఓ సాల్మన్ రాజ్, సీసీ శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ శ్రమ్‌కు ఆదరణ కరువు

- అసంఘటిత కార్మికులకు అండ
- నమోదు కాని వారు ఉపాధి వేతనదారులే
- సామాజిక భద్రత కోసం పోర్టల్ ఏర్పాటు
- బీమా అందజేయనున్న కేంద్రప్రభుత్వం



జిల్లా కార్మిక శాఖ కార్యాలయం


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ కమిషనర్, సిబ్బంది

విజయనగరం గంటస్తంభం: అసంఘటిత రంగంలో కార్మికులు, వలస కార్మికులు, చిరు వ్యాపారులకు భరోసా కల్పించేందుకు కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. దీంతో కార్మికుల సంక్షేమం కోసం వివిధ సామాజిక భద్రత పథకాలను మరింత మెరుగ్గా అమలు చేయడానికి వీలవుతుంది. కామన్ సర్వీస్ సెంటర్లలో కార్మికులు ఉచితంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ పోర్టల్‌ను ప్రారంభించి ఏడాది గడిచినా..చాలా మంది దరఖాస్తు చేసుకోకపోవడంతో సంక్షేమ పథకాల హక్కులకు దూరమవుతున్నారు.

చేకూరే ప్రయోజనాలివి..

అసంఘటిత రంగంలో కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే 12 అంకెలు కలిగిన ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేస్తారు. ఈ కార్డులు ఉన్నవారికే అన్ని రకాల సామాజిక భద్రత పథకాలు, సంక్షేమ పథకాలను వర్తింపజేస్తారు. ఇందులో నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు అంగవైకల్యం చెందితే రూ.ఒక లక్ష బీమాను ఉచితంగా అందజేస్తారు. అసంఘటిత రంగంలో కార్మికుల కోసం ప్రవేశపెట్టే పథకాల్లో నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్య మిస్తారు. వలస కార్మికులు ఎక్కడ ఉన్నారో గుర్తించి ఉపాధి మార్గాలను చూపిస్తారు. కార్మికుడిగా నమోదైతే ప్రభుత్వమే తోడ్పాటు అందిస్తుంది. విపత్తులు సంభవించినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సహాయకారిగా ఉంటుంది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడంలో చాలా మంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కొందరు మాత్రమే సద్వినియోగం చేసుకుంటున్నారు.

కొరవడిన అవగాహన..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో సుమారు 10 లక్షల 90వేల మందికి పైగా కార్మికులు ఉండగా..ఇంకా 5 లక్షల పైచిలుకు మంది ఈ-శ్రమ్ నమోదు చేసుకోవాల్సి ఉంది. ప్రారంభంలో అధికారుల అవగాహన కార్యక్రమాలు, కార్మిక సంఘాల నేతల సూచనలతో నమోదు చేసుకునేందుకు కార్మికులు పోటీపడ్డారు. క్రమంగా ఈ-శ్రమ్ పోర్టల్‌కు ఆదరణ కొరవడుతోంది. సంక్షేమ పథకాల ఫలాలు కార్మికులందరికీ అందేలా కార్మిక సంఘాల నేతలు, అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

మండలాలవారీగా ఈ-శ్రమ్ నమోదు వివరాలు		
మండలాల వారీగా సహాయ కార్మిక అధికారి పేరు ఫోన్ నంబర్ వివరాలిలా ఉన్నాయి		
విజయనగరం, గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ:	శ్రీనివాసరావు	9492555024
డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ:	శ్రీనివాసరావు	9492555025
నెల్లిమర్ల, గుర్ల :	చంద్రశేఖరరావు	9492555026
ఎస్.కోట, జామి, గంట్యాడ:	చంద్రకిరణ్	9492555027
కొత్తవలస, ఎల్.కోట, వేపాడ:	జోషిలా	9492555028
చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం:	చంద్రాబాయి	9492555032
రాజాం, రేగిడి,ఆమదాలవలస, వంగర, సంతకవిటి:	కొండలరావు	9492555044
బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం:	గౌరీ శంకర్	9492555030
పార్వతీపురం, సీతానగరం, గరుగుబిల్లి, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, బలిజిపేట:	వెంకటేశ్వరరావు	9492555029
సాలూరు, పాచిపెంట, మక్కువ:	సుందరరావు	9492555031
పాలకొండ, సీతంపేట, వీరఘట్టం:	శ్రీనివాసరావు	9492555037

నమోదు ఉచితం

ఈ-శ్రమ్‌లో వివరాల నమోదుకు అనుసంధానమైన మొబైల్ నంబర్ నామినీ ఆధార్ వివరాలు అవసరం. సమీప గ్రామ, వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ) లేదా కార్మికశాఖ కార్యాలయాల్లో సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తిగా ఉచితం. ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. అంతా అయ్యాక యూఏఎన్ గుర్తింపు కార్డు జారీ అవుతుంది.

అర్హులు వీరే..

- 16 నుంచి 59 సంవత్సరాల మధ్యలో ఉండాలి
- ఆదాయపు పన్ను పరిధిలోకి రానివారు
- ప్రావిడెంట్ ఫండ్(ఈపీఎఫ్ఓ), ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్(ఈఎస్ఐ)సదుపాయం లేనివారు
- ఉద్యానవనాలు, నర్సరీలు, పాడి పరిశ్రమ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, అనుబంధ రంగాల కార్మికులు టైలర్లు, డ్రైవర్లు, హెల్పర్లు, వీధి వ్యాపారులు, కల్లుగీత, రిక్షా కార్మికులు, చెత్త ఏరేవారు, కొరియర్ బాయ్‌లు, ఇళ్ల పనివారు, ఉపాధి వేతనదారులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, మధ్యాహ్న భోజనం వర్కర్లు, లోడింగ్,అన్ లోడింగ్ కార్మికులు, తదితరులందరూ ఈ పథకానికి అర్హులు.

అవగాహన కల్పిస్తున్నాం



ఈ-శ్రమ్ పథకంపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు ఆరుగురికి ప్రమాద బీమా పరిహారం రూ.2 లక్షలు చొప్పున అందజేశాం. ఒక ఇంటిలో ఎంత మంది ఉన్నా ఈ పథకానికి అర్హులే.

– ఎస్‌డీవీ ప్రసాదరావు, కార్మికశాఖ ఉప కమిషనర్, విజయనగరం జిల్లా

ని-క్షయ్ మిత్రలుగా ప్రభుత్వ ఉద్యోగుల నమోదు

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్


టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, లయన్స్ క్లబ్ సభ్యులు, ఐఎంఏ సభ్యులు, ఎన్‌జీఓలు ని-క్షయ్ మిత్రలుగా నమోదు కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. 100 రోజుల ఇంటెన్సిఫైడ్ టీబీ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ బారిన పడిన వ్యక్తులను దత్తత తీసుకుని, వారికి అవసరమైన పోషకాహార మద్దతుతో పాటు మెరుగైన జీవనం కోసం స్వచ్ఛందంగా ప్రతి నెలా రూ.700లు చొప్పున ఆరు మాసాల పాటు ఇచ్చేందుకు యోచించాలని కోరారు. వీటితో పాటు ప్రభుత్వం ఉచితంగా అందించే మందులను రోగి క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా టీబీని పూర్తిగా అంతమొందించవచ్చని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే 10 మంది వరకు ప్రభుత్వ వైద్యులు టీబీ బారిన పడిన వ్యక్తులను దత్తత తీసుకుని, వారికి పోషకాహార మద్దతును ఇస్తున్నారని, అదేవిధంగా మిగిలిన ఉద్యోగులు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దత్తత తీసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రధానమంత్రి క్షయ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లాలో టీబీని పూర్తిగా అంతమొందించేందుకు 100 రోజుల ఇంటెన్సిఫైడ్ కార్యక్రమాన్ని ఈ నెలాఖరు నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇందుకు స్వచ్ఛందంగా విరాళాలు అందించాలని, టీబీ బారిన పడిన వ్యక్తులకు పోషకాహారం కోసం విరాళాలు అందించాలనుకున్న వారు జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి, ఖాతా నంబర్ 004012010003135, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ 0800406, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెలగాం మెయిన్ రోడ్, పార్వతీపురం జిల్లా ఖాతాలో జమ చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఇతర వివరాల కోసం ఫోన్ 80083 11511 నంబర్‌ను సంప్రదించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా.ఎం.వినోద్ కుమార్, ఇతర వైద్యాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పనిలో పారదర్శకత,వేగవంతం

- పోలీస్ సిబ్బందికి ఈ ఆఫీస్ శిక్షణ
- ఎస్పీ వకుల్ జిందల్



డీపీఓలో సిబ్బందికి ఈ ఆఫీస్ శిక్షణ ఇస్తున్న ఎస్పీ వకుల్, చిత్రంలో ఏఎస్పీ సౌమ్యలత, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్ ఆర్.నరేంద్ర

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనలో పారదర్శకత, వేగవంతమైన సేవలందించేందుకు 'ఈఆఫీస్' విధానాన్ని మరింత మెరుగ్గా అమలు చేసేందుకు జిల్లా పోలీసు కార్యాలయం ఉద్యోగులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం చేపట్టామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్మించిన బిల్డింగ్‌లో ప్రారంభించిన ఈ శిక్షణను ఎస్పీ వకుల్ జిందల్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ ప్రభుత్వం డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తూ, కార్యాలయం పరిపాలనలో పారదర్శకతను, వేగవంతంగా సేవలందించేందుకు 'ఈఆఫీసు' విధానాన్ని ప్రారంభించిందన్నారు. ఈ ఆఫీస్ విధానంతో అధికంగా పేపర్లు వినియోగించకుండా, వేగవంతంగా సేవలందించే వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా నోట్‌ఫైల్స్, నిర్ణయాలు, అధికారుల మధ్య సమాచార మార్పిడి పూర్తిస్థాయిలో డిజిటల్ రూపంలోనే జరుగుతాయన్నారు. 'ఈఆఫీసు' విధానం పరిపాలనలో వినియోగం వల్ల కార్యాలయం సిబ్బందికి సౌలభ్యంగా ఉండడమే కాకుండా, ఫైల్స్‌కు భద్రత పెరుగుతుందని తెలిపారు. కావున, పోలీసు కార్యాలయం సిబ్బంది ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని, నిపుణులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవాలని పోలీసు కార్యాలయ ఉద్యోగులకు ఎస్పీ వకుల్ జిందల్ సూచించారు.

ఎంత పనైనా సులువుగా..

కార్యక్రమంలో ఈ ఆఫీసు డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్ ఆర్.నరేంద్ర మాట్లాడుతూ ఈఆఫీస్ వినియోగించడం ప్రారంభంలో కొద్దిగా ఇబ్బంది అనిపించినప్పటికీ, భవిష్యత్తులో ఎంత పనినైనా సులువుగా చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ప్రతిరోజూ అరగంట సమయాన్ని ఈఆఫీసు పట్ల అవగాహన కోసం వినియోగిస్తే, సులువుగా నిష్ణాతులు కావచ్చని చెప్పారు. ఈఆఫీసు వినియోగం వల్ల పంపిన ఫైల్స్ ఎవరి వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్న విషయాన్ని సులువుగా తెలుసుకోవచ్చునని నరేంద్ర అన్నారు. శిక్షణ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, ఏఓ పి.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు వెంకటలక్ష్మి, రామకృష్ణ, ఎస్పీ సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్కే చౌదరి, పోలీసు కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


పాపారావు (ఫైల్)


రాము మృతదేహం

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస, ఎం.రాజపురం గ్రామాల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. చిట్టపులివలస గ్రామానికి చెందిన కుప్పిలి పాపారావు(69) బుధవారం సాయంత్రం తన పొలానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే ఎం.రాజపురం గ్రామానికి చెందిన కొప్పర రాము (54) గురువారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకుని ఇంటికి వస్తుండగా తెగిపడిన విద్యుత్ వైరును గమనించకపోవడంతో అది కాలికి తగిలి షాక్‌కు గురై తన ఇంటి ముందరే మృతిచెందాడు. ఈ ప్రమాదాలపై ఫిర్యాదుల మేరకు ఎస్సై జి.కళాధర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


చింతల రామినాయుడు మృతదేహం

రామభద్రపురం: మండలకేంద్రానికి చెందిన వ్యక్తి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చింతల వీధికి చెందిన చింతల రామినాయుడు(80) కొన్ని నెలలుగా కడుపు నొప్పితో ఇబ్బందులు పడుతున్నాడు. ఆ బాధను తట్టుకోలేక ఈ నెల 7వ తేదీన తన పొలంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం విసయనగరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వి. ప్రసాదరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దత్తిరాజేరు:

మండలంలోని చినచామలాపల్లి గ్రామానికి చెందిన చిగడ బాలకృష్ణ(45) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి గురువారం తెలిపారు. ఈ ఘటనపై ఎస్సై తెలిపిన వివరాల మేరకు..బాలకృష్ణ మద్యానికి బానిసై భార్యా పిల్లలను తరచూ ఇబ్బంది పెట్టేవాడు. బుధవారం రాత్రి గొర్రెల మంద నుంచి ఇంటికి భోజనానికి వచ్చి మద్యం తాగి అల్లరి చేయడంతో తాగొద్దని భార్యాపిల్లలు హితవు పలకగా మనస్తాపం చెంది రాత్రి 9గంటల సమయంలో గ్రామంలో పురుగుమందు తాగి పడిపోయాడు. దీనిపై గ్రామస్తుల సమాచారంతో కుటుంబసభ్యులు వెంటనే 108లో విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడికి భార్య రాధ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి అచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

జంఝావతి రబ్బర్ డ్యామ్ తనిఖీలు


జంఝావతి రబ్బర్ డ్యామ్ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు కొమరాడ మండలంలోని జంఝావతి నదిపై నిర్మాణం చేసిన జంఝావతి రబ్బర్ డ్యామ్‌తో పాటు రిజ్వాయిర్ పరిసరాల్లో పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఎస్సై కె.నీలకంఠం ఆధ్వర్యంలో బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ బృందాలతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎస్సై నీలకంఠం మాట్లాడుతూ దేశ సరిహద్దులో ఏర్పడిన యుద్ధ వాతా వరణం నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రిజర్వాయర్ పరిధిలో ఎలాంటి అపరిచిత వ్యక్తులు కనిపించినా స్థానిక పోలీసులకు సమచారం ఇవ్వాలని కోరారు. రబ్బర్ డ్యామ్ పరిసరాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు పాల్గొన్నాయి.

చిన్నారుల అభ్యున్నతికి కృషిచేయాలి

విజయనగరం టౌన్: చిన్నారుల అభ్యున్నతికి తల్లిదండ్రులు కృషి చేయాలని తెలుగు భాషా పరిరక్షణ సమితి కార్యదర్శి డాక్టర్ జక్కు రామకృష్ణ కోరారు. వాగ్దేవీ బాల సంస్కార శిక్షణా తరగతుల్లో భాగంగా స్థానిక మహాకవి గురజాడ స్వగృహంలో వాగ్దేవి సమారాధనం సంస్థ, తెలుగు భాషా పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు శతక పద్యాలు, భగవద్గీత, సంస్కృతీ సంప్రదాయాలు, నీతికథలు తదితర వాటిపై విద్యార్థుల ప్రతిభను గురువారం పరీక్షించారు. అనంతరం వాటిల్లో సత్తా చాటిన పలువురికి బహుమతులు అందజేశారు. అలాగే 22 మందికి జిల్లా కేంద్ర గ్రంథాలయం సభ్యత్వం ఇచ్చారు. కార్యక్రమంలో వాగ్దేవీ సమారాధనం సంస్థ వ్యవస్థాపకురాలు పెన్నేటి స్వప్న హైందవి, తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తం

- జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి బారిన పడకుండా ఉండే అవకాశం
- 2024లో 203 కేసుల నమోదు
- ఈఏడాదిలో 23 కేసుల నమోదు
- నేడు డెంగీ నివారణ దినం



2020 నుంచి 2025 మే 15 వరకు చేసిన డెంగీ కేసుల వివరాలు	
సంవత్సరం	నమోదైన కేసుల సంఖ్య
2020	15
2021	242
2022	451
2023	444
2024	203
2025	23

విజయనగరం ఫోర్ట్: డెంగీ వ్యాధి పట్ల ఏమాత్రం అలసత్వం వహించినా మృత్యువాత పడే ప్రమాదం ఉంది. తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం. గత ఏడాది రెండు వందలకు పైగా డెంగీ కేసులు జిల్లాలో నమోదయ్యాయి. సకాలంలో చికిత్స చేయించుకుంటే కోలుకోవడానికి అవకాశం ఉంటుంది.


డెంగీ లక్షణాలు

వైరల్ జ్వరం మాదిరి వచ్చి ఆకస్మాత్తుగా తీవ్రంగా పరిణమిస్తుంది. తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కీళ్లనొప్పులతో పాటు ఎముకలు విరిగేటంత నొప్పి కలిగిస్తుంది. ఒక్కోసారి శరీర అంతర్భాగాల్లో రక్తస్రావం జరగడం వల్ల కాళ్లు, చేతులు, ముఖం, వీపు ఉదర భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లు చిన్నచిన్న మొటిమలు కనిపిస్తాయి. ఒక్కో సారి ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి రోగి పరిస్థితి విషమంగా ఉంటుంది. ఈడిస్ ఈజిప్ట్ అనే దోమకాటు వల్ల డెంగీ వ్యాప్తి చెందుతుంది. దోమ పగటి పూట కుడుతుంది. దోమ కుట్టినప్పుడు ఒళ్లంతా దద్దుర్లు కనిపిస్తాయి. ఇళ్లలోని కుండీలు, గోలాలు, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లోను, ఎయిర్ కూలర్లు, ఇళ్ల పరిసరాల్లో నిర్లక్ష్యంగా పడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ కప్పులు, పగిలిన సీసాలు, టైర్లు వంటి వాటిల్లో చేరిన దోమలు వర్షపు నీటిలో గుడ్లు పెట్టడంతో ఈడిస్ దోమ పెరుగుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇంటి పరిసర ప్రాంతాల్లో వృథా నీటిని నిల్వ ఉంచరాదు. పెంటకుప్పలు, ఇంట్లో వచ్చే చెత్తాచెదారం ఇంటికి దూరంగా వేయాలి. ఇళ్లలో ఉన్న అన్ని గదుల్లో దోమల మందు చల్లించాలి. దోమతెరలు వాడడం లేదా ఇంటి కిటికీల తలుపులకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలి. నీరు నిల్వ చేసే పాత్రలను ప్రతి వారానికి ఒక సారి ఖాళీ చేసి మళ్లీ నింపుకోవాలి. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాతటైర్లు, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండిషనర్లు, పూలకుండీల్లో నీటిని తరచూ మార్చాలి. నీళ్ల ట్యాంకులపై సరైన మూతలను అమర్చాలి. క్రమంగా ఇంటిని శుభ్రం చేసుకోవాలి. దోమ కాటునుంచి రక్షణకోసం శరీరం అంతా కప్పి ఉంచుకునే విధంగా దుస్తులు వేసుకోవాలి. ముఖ్యంగా పిల్లలను బట్టలు లేకుండా బయట తిరగనీయరాదు. కుళాయి దగ్గర నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలో గల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలి.

ఆందోళన అవసరం లేదు



దోమల వృద్ధిని అరికట్టడం ద్వారా డెంగీ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు. డెంగీ వ్యాధి పట్ల ఆందోళన అవసరం లేదు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ద్రవపదార్థాలు, పళ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలి.

డాక్టర్ ఎస్.జీవన రాణి, డీఎంహెచ్ఓ

డీసీసీబీ నికర లాభం రూ.7.66 కోట్లు

- ఏ కేటగిరీ వాటాదారులకు రూ.1.09 కోట్ల డివిడెండ్ ప్రకటన

విజయనగరం అర్బన్:

గడచిన ఆర్థిక సంవత్సరంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రూ.7.66కోట్ల నికర లాభం ఆర్జించినట్లు డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ ఎస్.సేతుమాధవన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో గురువారం జరిగిన సభలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి లావాదేవీల ముగింపునకు సంబంధించిన స్టాట్యూటరీ ఆడిట్ నివేదికను, లాభనష్టాల నివేదికపై బ్యాంకు సీఈఓ సీహెచ్ ఉమామహేశ్వరరావుతో కలిసి చర్చించారు. బ్యాంకును లాభాలబాటవైపు నడిపించిన సహకార సంఘాలు, డీసీసీబీ సిబ్బందిని అభినందించారు. నాబార్డు, ఆప్కాబ్ బ్యాంకులకు జేసీ కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకుకు చెందిన ఏ-క్లాస్ వాటాదారులకు లాభాల్లో ఒక శాతం రూ.1.09 కోట్లు డివిడెండ్‌గా ప్రకటించినట్టు తెలిపారు.